‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

మెట్‌పల్లి, జనవరి 31:కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కృషితో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.5.64 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను తాను కలిసి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని విన్నవించినట్లు ఎమ్మెల్యే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ నుంచి చిన్నమెట్‌పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.35 కోట్లు, ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్ నుంచి గోదావరినది (పుష్కర ఘాట్) వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.65.75 లక్షలు, మల్లాపూర్ మండలం వాల్గొండ నుంచి గొర్రెపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. కోటి 45 లక్షల 63 వేలు, మెట్‌పల్లి మండలం చౌలమద్ది నుంచి మారుతీనగర్ (ఎన్‌హెచ్-63) వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 39.80 లక్షలు, కోరుట్ల పట్టణం నుంచి సంగెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 78.85 లక్షలు, మల్లాపూర్ మండలం వేంపల్లి వెంకట్రావుపేట నుంచి గౌరీశ్వరాలయం వరకు రూ.99.60 లక్షలు కేటాయించారు. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఫైరింగ్‌లో నైపుణ్యం పెంపు కోసమే శిక్షణ

ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31: ఫైరింగ్‌లో నైపుణ్యాన్ని పెంపొందించడానికే వార్షిక ఫైరింగ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఫైరింగ్ రేంజ్‌లో పోలీసులకు ఏర్పాటు చేసిన ఫైరింగ్ శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరై ఫైరింగ్ శిక్షణ తీరును పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ, వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను వృత్తిలో వినియోగించుకోవాలన్నారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబర్చిన వారిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రఘుచందర్, రాములు, రంగారెడ్డి, ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, వేణు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కోరుట్ల, జనవరి 31: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు కోరారు. పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో శుక్రవారం ఫెడరేషన్ రాష్ట్ర రెండో మహాసభల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎండీ మౌలానా, రాష్ట్ర అధ్యక్షుడిగా గోవర్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాములు, ఉపాధ్యక్షులుగా శాంత, కేవీ అనసూయ, గోదావరి, సహాయ కార్యదర్శులుగా సదానందం, భానుచందర్, లక్ష్మణ్, కోశాధికారిగా ముక్రం, కార్యవర్గ సభ్యులుగా రాములు, అజ్జు, వేణు, తోట భిక్షపతి, ఓమయ్య, ఖాసీం ఎన్నికయ్యారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ | ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

సమర్థవంతమైన పోలీసింగ్‌తోనే శాంతిభద్రతల పరిరక్షణ

- ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి
- మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష

ఐజీ చంద్రశేఖర్‌రెడ్డికి పూల మొక్క అందజేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31: సమర్థవంతమైన పోలీసింగ్‌తోనే శాంతి భద్రతలు పటిష్టంగా అమలవుతాయని మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించాలన్నారు. నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలన్నారు. రోజు వారీ పెట్రోలింగ్‌ను పటిష్ట పర్చాలని, తక్కువ సమయంలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరస్తులను పట్టుకొని, శిక్ష పడేలా చూడాలన్నారు. మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగదారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టాలన్నారు. వుమెన్ సేఫ్టీ, సైబర్ నేరాలు, నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై అధికారులతో చర్చించారు. అంతకు ముందు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఐజీకి ఎస్పీ మొక్క అందజేసి స్వాగతం పలికారు. అలాగే, పోలీసు అధికారులు గౌరవ వందనం సమర్పించారు.

జిల్లాలో పోలీసుల పనితీరు బేష్

ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల సేవలు బేష్ అని ఐజీ అభినందించారు. శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని, అధికారులు, సిబ్బంది శాంతి భద్రతల పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి పోలీసు సేవలు బేషుగ్గా ఉన్నాయని ఐజీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీలు రఘుచందర్, రాములు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, ఐటీ కోర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరీఫ్ అలీఖాన్, రఫీక్‌ఖాన్, శ్రీనివాస్, సీఐలు వేణుగోపాల్, రామ్‌నర్సింహారెడ్డి, నీలం రవి, నిరంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఐఆర్ ఐలు కిరణ్‌కుమార్, వేణు, ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్
- ముగిసిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

ర్యాలీ తీస్తున్న రవాణా శాఖ అధికారులు, విద్యార్థులు

జగిత్యాల, జనవరి 31: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ కోరారు. జగిత్యాలలో శుక్రవారం రవాణా శాఖ, ప్రైవేట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టగా, ముఖ్య అతిథిగా డీటీవో శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రత నిత్య జీవితంలో భాగమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు. చిన్న పొరపాటు, నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందని, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా వాహనాలు నడపాలని ట్యాక్సీ, ఆటో, కార్లు, ఇతర పెద్ద వాహనాల డ్రైవర్లకు సూచించారు. అలాగే, జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటోలో ప్రయాణికులను పరిమితికి మించి తరలించవద్దని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంవీఐలు రామారావు, వెంకన్న, అభిలాష్, ప్రమీల, యూట్యూబ్ ఫేమ్ గంగవ్వ, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి శ్రీధర్ రావు, జగిత్యాల పట్టణాధ్యక్షుడు ఎడమల జగన్మోహన్ రెడ్డి, పాఠశాలల కరస్పాండెంట్లు గంగారెడ్డి, రవీందర్ రెడ్డి, హరిచరణ్ రావు, రాబర్ట్, బోగ రవిప్రసాద్, శ్యామ్, కిషన్ రెడ్డి, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, సయ్యద్ ఎక్బల్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

కథలాపూర్, జనవరి 31: పోస్టల్ బీమా పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఉమ్మడి కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ కోరారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలోని సబ్ పోస్టాఫీసును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బీమా పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, అందులో చేరేలా సిబ్బంది ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రజల కోసం ప్రత్యేకంగా బీమా పథకాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ జయరాం, బీపీఎంలు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

మెట్‌పల్లి, జనవరి 31: వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ కోరారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఖాళీ స్థలంలో శుక్రవారం వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి రోజూ మొక్కలకు నీళ్లు పట్టాలని, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే, ఇంటి ముందు ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి కంటికి రెప్పలా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, పర్యావరణ ఇంజినీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, నిజాముద్దీన్, అశోక్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకుడు తిరుపతి

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు

పెగడపల్లి, జనవరి 31: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పెగడపల్లి సహకార సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు, ముదిరాజ్ సంఘం నియోజకవర్గ నాయకుడు మడిగెల తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చడంతో పాటు చేప పిల్లలను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని అసెంబ్లీలో నిలదీయాలని ఎమ్మెల్సీకి తిరుపతి వినతి పత్రం అందజేశారు.

భౌతిక, రసాయన శాస్త్రాలపై ఆసక్తి పెంచుకోవాలి

మెట్‌పల్లి: ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

మెట్‌పల్లి, జనవరి 31: విద్యార్థులు భౌతిక, రసాయన శాస్త్రాలపై ఆసక్తి పెంచుకోవాలని, బాగా చదివితే భవిష్యత్‌లో ఇంజినీర్లు, డాక్టర్లుగా ఎదిగేందుకు దోహదపడుతుందని మండల విద్యాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం మెట్‌పల్లి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్‌లో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి హిమకర్, వెల్లుల్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సత్యనారాయణ, మెట్లచిట్టాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వినాయక్‌కు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌రావు, ఫోరం అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి నర్సింహాచారి, ఉపాధ్యక్షురాలు మమత, నాగన్న, శేషశయన తదతరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, జనవరి 31: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తిర్మలాపూర్‌కు చెందిన గంగుల అభినయ్ (ప్రథమ), కొడిమ్యాలకు చెందిన సుష్మశ్రీ, రమ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి, జనవరి 31: భీమారం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో భీమారం జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి గంప రుష్వీత (స్మైలీ) ప్రథమ ర్యాంక్ సాధించింది. రుష్వితను ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, ఏఎంసీ చైర్‌పర్సన్ డిండిగాల లావణ్య, ఉపాధ్యాయులు రాజమల్లయ్య, లక్ష్మీనారాయణ, జ్యోతి, నాయకుడు చెక్కపెల్లి రఘు, తదితరులు అభినందించారు.

రాయికల్, జనవరి 31: పట్టణంలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాయికల్ ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ (ప్రథమ), అల్లీపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అక్షయ (ద్వితీయ), మూటపెల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్థిక తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎంఈవో శ్రీపతి రాఘవులు, హెచ్ఎంలు శ్రీనివాస్, రమేశ్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.